# సత్యవాక్కు

## క్రైస్తవ మాస పత్రిక

THE WORD OF TRUTH

## మీకొక సదవకాశము !

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 20 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్య మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 15/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి!!

**SATYA VANI**
(P.O. Box 80) Seshagiri Rao St.
KAKINADA-533 004


గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగినప్పుడు మీ సత్యవాక్య నంబరును మాకు తెలియజేయండి. ఇది అత్యవసరం !!

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.O. Box 80, KAKINADA, A.P 533 001.

Editor : J.C. CHOATE

Managing Editor : JOSHUA GOOTAM

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి **11** మార్చి **1991** సంచిక **8**

# సంపాదకీయము

## సహాయములేని బోధకులు

## (Unsupported Preachers)

కొందరు ఏవిధమైన సహాయము లేకుండా సువార్త పని చేయుచున్నామని చెబుతూ యుంటారు. మరికొందరు మా వద్ద చాలమంది సపోర్టులేని బోధకులున్నారని చెబుతారు. అయితే దేవుని సహాయము లేకుండా మానవుడు బ్రతకడం కష్టమని తెలియజేయగోర్తాను. దేవుని వాక్యమీలాగు చెప్పుచున్నది: "ఆయన గత కాలములలో సమస్త జనులను తమతమమార్గములయందు నడువనిచ్చెను. అయినను ఆయన ఆకాశమునుండి మీకు వర్షమును ఫలవంతములైన ఋతువులను దయ చేయుచు, ఆహారము ననుగ్రహించుచు ఉల్లాసముతో మీ హృదయములను నింపుచు మేలుచేయుటచేత తన్నుగూర్చి సాక్ష్యము లేకుండ చేయలేదు" (అ.పొ.కా. 14:16-17).

ప్రతి ధాన్యపు గింజలోను దేవుడు జీవాన్ని ఉంచకపోతే తినుటకు ఆహారము లభించదు. అంతేకాదు ఆయన సూర్యరశ్మిని, వర్షా

లను పంపుచున్నాడు. ఈ మూడింటిని దేవుడు అనుగ్రహించకపోతే మానవుడు భూమిమీద త్వరలో నశించును. పౌలు ఇట్లనుచున్నాడు: "ఆయన మనలో ఎవనికిని దూరముగా ఉండువాడు కాడు. మన మాయన యందు బ్రదుకు చున్నాము, చలించుచున్నాము, ఉనికికలిగి యున్నాము" (అ.పొ కా. 17:27, 28). దేవుని సృష్టిలో భాగంగా, మనము దేవునినుండి సహాయము పొందుటలేదని చెప్పలేము.

ఇందులో విశ్వాసముయొక్క ప్రాధాన్యత గమనించాలి. "విశ్వాసము లేకుండ దేవునికి ఇష్టుడై యుండుట అసాధ్యము; దేవుని యొద్దకు వచ్చువాడు ఆయన యున్నాడనియు, తన్ను వెదకువారికి ఫలము దయచేయువాడనియు నమ్మవలెను గదా" (హెబ్రీ 11 : 6). ఈ భూమిపై జీవించడానికి మనకు ఆహారము, వస్త్రములు, వసతి అవుసరం. మత్తయి 6 : 25-31 లో యేసు వీటిని గూర్చియే చెబుతాడు. ఇవన్నియు అవుసరమని మన పరలోకపు తండ్రికి తెలియును. అయితే మనం యేమి చేయాలి? "కాబట్టి మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి; అప్పుడవన్నియు మీ కనుగ్రహింపబడును" (6 : 32, 33). పేదరికాన్ని పారద్రోలాలంటే మనం ఇవ్వాలి అని యేసు చెప్పుచున్నాడు. "ఇయ్యుడి అప్పుడు మీ కియ్యబడును; అణచి కుదిలించి దిగజారునట్లు నిండుకొలతను మనుష్యులు మీ ఒడిలో కొలుతురు" (లూకా 6 : 38).

నీవు సరిగ ఇయ్యలేనందువలన అభివృద్ధి చెందకపోవుచున్నావా? "మానవుడు దేవునియొద్ద దొంగిలునా? అయితే మీరు నా యొద్ద దొంగిలితిరి. దేనివిషయములో మేము నీ యొద్ద దొంగిలితిమని మీరందురు. పదియవ భాగమును ప్రతిష్ఠితార్పణములను ఇయ్యక దొంగిలితిరి. ఈ జనులందరును నాయొద్ద దొంగిలుచునే యున్నారు, మీరు శాపగ్రస్తులై యున్నారు, నా మందిరములో ఆహారముండు

నట్లు పదియవభాగ మంతయు మీరు నా మందిరపు నిధిలోనికి తీసికొని రండి; దీని చేసి మీరు నన్ను శోధించిన యెడల నేను ఆకాశపు వాకిండ్లను విప్పి పట్టజాలనంత విస్తారముగా దీవెనలను కుమ్మరించెదనని సైన్యములకు అధిపతియగు యెహోవా సెలవిచ్చుచున్నాడు" (మలాకీ 3 : 8-10). యిది మనకు బుద్ధి కలుగుటకు వ్రాయబడింది (రోమా 15 : 4). రొట్టె విరుచుటకు మనమెట్లు కూడుకొందుమో, అట్లే కానుకలు కూడ ఇవ్వాలి.

కాకినాడలో క్రీస్తు పనికి ఉపయోగకరంగా యుండుటకుగాను మనమొక భవనమును నిర్మించుకొన్నాము. గత సంవత్సరములో భీకరమైన తుఫాను వచ్చినను, ఈ బిల్డింగు నిమిత్తము భారతీయ సహోదరులు ఇంచుమించు 80 వేల రూపాయలు విరాళము నిచ్చారు. యిచ్చినందువలన ఎవరు బీదవారై పోలేదు. ఏలయనగా వారందరు పరలోకంలో ధనాన్ని కూర్చుకొన్నారు.

పనిచేయు నిమిత్తము దేవుడు మానవుని చేసాడు. "దేవుడైన యెహోవా నరుని తీసికొని ఏదెను తోటను సేద్యపరచుటకును, దాని కాచుటకును దానిలో ఉంచెను" (ఆది 2:15). ఈ పనిచేయు మానవుడు ఆరాధించాలి. దేవుని ఆజ్ఞల ననుసరించి ఈ యారాధన ఉండాలి. "విశ్వాసమును బట్టి హేబేలు కయీను కంటె శ్రేష్టమైన బలి దేవునికి అర్పించెను. దేవుడతని అర్పణలను గూర్చి సాక్ష్యమిచ్చినప్పుడు అతడు ఆ విశ్వాసమునుబట్టి నీతిమంతుడని సాక్ష్యము పొందెను. అతడు మృతి నొందియు ఆ విశ్వాసముద్వారా మాట్లాడుచున్నాడు" (హెబ్రీ 11:4). దేవుడంగీకరించే ఆరాధన విశ్వాసమును బట్టి యుండాలి. ఆ విశ్వాసము వినుటవలన కలుగును (రోమా 10:17). దేవుడు చెప్పినట్లు చేయనందువలన కయీను దేవుని కృపను కోల్పోయాడు. మనం విశ్వాసముతో ఆరాధించాలని హేబెలు ఇంకా

మనకు చెప్పుచునే యున్నాడు. దేవుడు దేని నేరీతిగా చేయాలని చెప్పుచున్నాడో దానిని ఆ రీతిగా చేయుట విశ్వాస సంబంధమైన ఆరాధన.

మానవుడు పనిచేయుటకు, ఆరాధించుటకుగాను మోషే ధర్మ శాస్త్రము ఒక క్రియ పద్ధతిని ఏర్పాటు చేసింది. పదియవవంతు ఇచ్చుట ఆరాధనలో ఒక భాగమై యుండెను (ఆది.కా. 14:18, 19). ఇశ్రాయేలీయులు పదియవ వంతు చెల్లించనందువలన శాపగ్రస్తులైరి. దశమ భాగము అర్పించిన తరువాతనే దీవెనలు కుమ్మరింపబడును (మలాకీ 3:8-10). ఇచ్చినవారిని దీవించెదనని యేసు వాగ్దానము చేసాడు. భారతీయుల యెడల యిది ఎందుకు నెరవేర్చబడుటలేదు? ఒక వేళ నెరవేర్చబడిన యెడల సపోర్టులేని ప్రతి బోధకునికి అమెరికా సహాయం ఎందుకు అవసరం? సమస్య ఎక్కడ ఉన్నది? మనం దేవుని వాక్యాన్ని నమ్ముటలేదు, అంతే.

ఈ దిగువ యాజ్ఞ అందరికీ వర్తిస్తాది: "మనవారును నిష్ఫలులు కాకుండు నిమిత్తము అవసరమును బట్టి సమయోచితముగా సత్‌క్రియలు శ్రద్ధగా చేయుటకు నేర్చుకొనవలెను" (తీతు 3:14). మనం ఆదిమ క్రైస్తవ్యాన్ని పునరుద్ధరించాలంటే ఈ లేఖనభాగాన్ని తీవ్రంగా పఠించాలి, విధేయత చూపాలి. అప్పుడు ప్రభువుయొక్క సముఖమునుండి విశ్రాంతి కాలములు వచ్చును.

1 తిమోతి 1:3లో బోధకుని విధి వర్ణించబడింది. సత్యమునకు భిన్నమైన బోధ చేయవద్దని అక్కడ ఆజ్ఞాపింపబడింది. భారతీయ సువార్తికులు చాలమట్టుకు సత్యము నెరిగినవారే. అయితే వారు మత్తయి 6:25-42లో చెప్పబడింది ఎరగాలి, బోధించాలి. మొదట మనం ఆయన రాజ్యాన్ని నీతిని వెదకాలి. అప్పుడవన్నియు మన కనుగ్రహింప బడతాయి.

తరువాత ఇంకేమి ఆజ్ఞాపింపబడింది! సువార్తయొక్క మూల సూత్రాల్లో సహవాసమున్నది (అపో. కా. 2:42). సహవాసము లేనియెడల మనకు పాపక్షమాపణ లేదు. (1 యోహాను 1 : 7). ఇచ్చి పుచ్చుకొనుటలో సహవాసముండాలి (ఫిలిప్పీ 4 : 15). తండ్రియైన దేవునితోను, కుమారునితోను, అపొస్తలులతోను సహవాసము కలిగియుండాలి (1 యోహా 1:1-3). దేవుడు తన కుమారుని మన నిమిత్తం ఇచ్చాడు (యోహాను 3:16). మనమేమి యిచ్చుచున్నాము!

మీరిచ్చుచున్న కానుకలవలన మీ స్థానిక సంఘాలు స్వయం పోషకమవ్వాలి. యిచ్చుటవలన మీరు, మీ కుటుంబాలు దీవించబడతారు. అంతేకాదు ఏసహాయం లేకుండా పని చేయుచున్నామని చెప్పే బోధకుల సంఖ్య యిక ఉండదు.

—జె సి. బెయిలీ.

---

## సౌందర్యము

సౌందర్యమనగా అందము లేక చక్కదనమని అర్థము. సౌందర్యము ఉప్పు వంటిది. ఇది లేని జీవితము నిస్సారము. సౌందర్యము దేవుడు మానవునికిచ్చిన ఒక ప్రత్యేక బహుమతి. సౌందర్యమునకు విధాత ఆదిసంభూతుడైన దేవదేవుడే. ఆది పితరులైన ఆదాము హవ్వలను కురూపులవలె కాక పరిపూర్ణ ముగ్ధ సౌందర్యవంతులుగా సృజించెను. మానవుడు సౌందర్య పిపాసి. నేడు మానవులు దైవారాధనకంటె ఎక్కువ ప్రాధాన్యత సౌందర్యమునకు ఇచ్చుట మనకు కన్పించుచున్నది. సౌందర్యము కలిగియుండుట, దానిని కాపాడుకొనుట తప్పుకాదు గాని మనకు లేని అందమును కొనితెచ్చుకొనుట పులిని చూచి నక్క వాతలు వేసుకొన్నట్లుండును. అందుకే జ్ఞాని

మైన సొలొమోను పరిశుద్ధాత్మ వశుడై "అందము మోసకరము, సౌందర్యము వ్యర్థమని పల్కెను" (సామె 31:30).

## సౌందర్యవంతులైన స్త్రీ పురుషులు

రాహేలు రూపవతియు సుందరియునై యుండెను (ఆది 29:17), గాని సహజముగా స్త్రీలకుండు అసూయను కలిగియుండెను. అసూయ ఆపది అక్కచెల్లెల్లను లోకోక్తి కలదు. ఈమెకు తన అక్కయైన లేయాపట్ల ప్రేమ లేకుండుటచే అసూయకు దారితీసినది. "మత్సరము ఎముకలకు కుళ్ళు" (సామెతలు 14 : 30) అని దైవగ్రంథమునందు చెప్పబడినది. అట్లే అబీగయీలు, బత్షెబాలుకూడా సౌందర్యవంతులే (1 సమూ 25 : 3, II సమూ 11:3). అయినను దేవునిపట్ల, కుటుంబ పరిరక్షణ విషయంలో ఈనాటి స్త్రీలకు ఆదర్శపాత్రియులు. సౌందర్యవతియగు రూతునుంచి ప్రతి కోడలు నేర్చుకొనవలసిన విధేయత కనిపించును. అట్లే సౌందర్యవతియైన వష్తికిని (ఎస్తేరు 1:10) రాణియైన ఎస్తేరుకును చాలా వ్యత్యాసము కలదు. ఇద్దరూ సౌందర్యవతులే కాని వష్తి తన సౌందర్యమునుబట్టి గర్వించి రాజైన అహష్వేరోషు మాట ధిక్కరించి అవమానపరచెను. అందుకే రాణి హోదాను కోల్పోయెను. "నాశనమునకు ముందు గర్వము నడచును. పడిపోవుటకు ముందు అహంకారమైన మనస్సు నడచును" (సామె 16:18). వివేకములేని సుందరస్త్రీ పందిముక్కునకున్న బంగారు కమ్మివంటిది అని పరిశుద్ధ గ్రంథమునందు చెప్పబడెను (సామె 11 : 22); (ఎస్తేరు 2 : 7).

యోసేపు, మోషే, సౌలు, దావీదులు కూడా సౌందర్యవంతులే (ఆది 39.6-7; నిర్గమ 2:2, 1 సమూ 9:2, 1 సమూ 16:12). అయినను దేవుని యెడల వినయ విధేయతలు కలిగి యుండిరి.

# సౌందర్యమువలన కలుగు ప్రమాదములు

అబ్రాహాము కనాను విడిచి ఐగుప్తుదేశంలో నివసించుటకు అక్కడికి వెళ్ళెను. అతడు తన భార్యయయిన శారయితో నీవు చక్కని దానివని యెరుగుదును. ఐగుప్తీయులు నిన్ను చూచి యీమె అతని భార్య అని చెప్పి నన్ను చంపి నిన్ను బ్రతుకనిచ్చెదరు. నీ వలన నాకు మేలు కలుగునట్లును నిన్నుబట్టి నేను బ్రతుకునట్లును నీవు నా సహోదరివని దయచేసి చెప్పుమనెను. అబ్రాహాము ఐగుప్తులో చేరినప్పుడు ఐగుప్తీయులు ఆ స్త్రీ మిక్కిలి సౌందర్యవతియై యుండుట చూచిరి. ఫరోయొక్క అధిపతులు ఆమెను చూచి ఫరోయెదుట ఆమెను పొగడిరి. గనుక ఆ స్త్రీ ఫరో యింటికి తేబడెను (ఆది 12:10-20). శారా సౌందర్యవంతురాలగుటవలన అబ్రాహాము భయపడి అబద్ధమాడవలసి వచ్చినది. అబ్రాహామువలెనే ఇస్సాకుకూడా రిబ్కా సౌందర్యవతి అగుటవలన గెరారు ప్రజలవలన తనకు హాని సంభవించునని భావించి భార్య అని చెప్పుటకు భయపడి సహోదరి అని చెప్పెను (ఆది 26:6-11). యాకోబు కుమార్తె అయిన దీనాను షెకెము చెరచెను. అందువలన యాకోబు కుమారులైన షిమ్యోను, లేవియు షెకెమును చంపిరి (ఆది కా. 34వ అధ్యాయము). II సమూ 11వ అధ్యాయము మరియు 13వ అధ్యాయము పఠించినయెడల దేవుని దృష్టికి ఇష్టానుసారుడని పిలువబడిన దావీదు మహారాజు ఊరియా భార్యయు సౌందర్యవతియగు బత్షెబ యెడల వ్యామోహముగలవాడై నీతి న్యాయములను దైవ చట్టమును ధిక్కరించి ఆమెను చెరచుటయే కాక ఊరియాను చంపించెను.

దావీదు కుమారుడైన అమ్నోను దావీదు కుమార్తె అయిన తామారునందు వాంఛగలవాడై సౌందర్యమనే మత్తునకు బానిసై ఆమెను అవమానపరచెను. దాని ఫలితముగా తామారు అన్నయగు అబ్షాలోముచే అమ్నోను చంపబడెను.

## అలంకరణ విషయములో నిజ క్రైస్తవుల శ్రద్ధ అవసరం

అలంకరణకు ప్రత్యేక శ్రద్ధ వహించువారు స్త్రీలే. క్రైస్తవుడు అనగా క్రీస్తు సారూప్యమును కలిగి ఆయనను ధరించుకొనినవాడని, ఆయనను అనుసరించువాడని అర్ధము. ఉదా:- "15వ శతాబ్దములో ఫ్రాన్సుదేశంలో నవార్కికిచెందిన మార్గరేట్ టి వాలాయ్స్ అనే రాణికి తన 50వ సం॥లో "ఎక్సిమా" అనే చర్మవ్యాధి ముఖానికి వస్తే ముఖానికి బియ్యంపిండి వ్రాసుకునేది. అప్పటినుండి పౌడర్ వాడుక లోకి వచ్చినది. ఆస్ట్రియా యువరాజు వెన్‌జెల్‌బర్గ్ (17-11-94) రోజుకు 30 సార్లు దుస్తులు మార్చేవాడట". "స్త్రీలు సంఘానికి కేవలం అలంకారప్రాయులే కాదు సంఘ స్థితికి మూల స్తంభాలు" అని ఎమర్సన్ నుడివెను. ప్రఖ్యాత ఆంగ్లకవి, రచయిత అయిన షేక్స్పియర్ "సౌష్టవంగల స్త్రీ నగతో సమానము. సౌశీల్యంగల స్త్రీ సంపదతో సమానం" అనెను. కనుక పరిశుద్ధ గ్రంథమునందలి 1 తిమో 2:9-10; 1 పేతురు 3:3-5 మనయింటనున్న స్త్రీలకు చదివి అందలి ఆత్మీయార్థము తెలియపర్చవలసిన బాధ్యత మనపైన గలదు. క్రైస్తవుని శరీరం దేవునికే చెందుతుంది (1 కొరింథి 6:19-20). మన శరీర అవయవాలు దేవుని నీతికి లోబడాలి (రోమా 6:13, రోమా 12:1, 2). బాహ్య సౌందర్యముకంటె అంతరంగ సౌందర్యము ప్రాముఖ్యమైనది. యెహోవాయందు భయభక్తులు కలిగిన స్త్రీ కొనియాడబడును (సామె 31:30, 14:1).

—పి. చంద్రశేఖర్, క్రీస్తుసంఘం, ధవళేశ్వరం.

# నిషిద్ధం

మోహపు చూపులు తూపులు
కళంకమైన కామ వాంఛలు
సామాజిక జీవన స్రవంతిలో
దైవిక ప్రజలను సైతము
గుణహీన తురంగాల్ని చేస్తాయి! (కీర్తన 32:9)

శాస్త్రసమ్మతం సర్వత్రా ఆమోదం
సతీపతుల సంగమం దైవనిర్ణయం
వ్యభిచారమైతే, చట్టవిరుద్ధం
ఎయిడ్స్‌కు (శ్రీ) కారమది సాంఘిక నేరం
కామత ప్తులవ్వక పెండ్లియాడుట క్షేమం! (1 కొరి 7:9).

పురుషుడికి పరస్త్రీల సంబంధం
పడతికి పరపురుష సంభోగం
పరువునష్టం ప్రాణాంతకం
జారత్వం వ్యభిచారం వేశ్యాగుణం
క్రీస్తు రాజ్య పౌరులకు నిషిద్ధం!

(మత్త 5:28; హెబ్రీ 13:4; ప్రకటన 21:8).

—యస్. జె. మేడిది, కొణితివాడ.

—o—

# చిన్నపిల్లలు బాప్తిస్మము పొందవలెనా ?
## (Should Infants be Baptized)

చిన్నపిల్లలు ఏపాపము లేనివారు. మొదటి మానవుడైన ఆదాము చేసిన పాపమునకు చిన్నపిల్లలు వారసులని కొందరు బోధించుచున్నారు. జన్మించిన ప్రతి శిశువు పాపములో నశించినవాడని వారు బోధించుచున్నారు. బైబిలు అట్టి బోధన బోధించుటలేదు.

ఆదాము అవ్వలుచేసిన పాపమువలన కొన్ని ఫలితములు కలిగెను. ఆదాము అవ్వలు నిర్దోషులుగా మొదట నివసించిరి. మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్ష ఫలములను తినుటద్వారా దేవునికి అవిధేయులైరి. వారు ఆ ఫలము తినినప్పుడు దేవుడు వెంటనే వారికి మంచి చెడ్డల తెలివి నిచ్చెను. ఆ తెలివిద్వారా చెడను విసర్జించి మంచిని జరిగించవలసియున్నది. ప్రతి (స్త్రీ) పురుషుని యందు వారు ఎదుగుచున్న కొలది మంచిచెడ్డలను వివేచించే ప్రాథమిక జ్ఞానము కలుగుతుంది.

ఆదామును అవ్వను దేవుడు వారి పాపము నిమిత్తమై అనేక విధములుగ శిక్షించెను. స్త్రీకి ప్రసవ వేదన కలుగజేసెను. భర్తకు లోబడి యుండునట్లు ఆమెకు ఆజ్ఞాపించెను. పంటను పండించుటకు కష్టపడునట్లు ఆయన ఆదాముపై భారమును వేసెను. మానవాళి భౌతికముగ చనిపోవునట్లు ఆయన నియమించెను. ఏదేను వనమునుండి ఆదామును అవ్వను పారద్రోలెను (ఆది 3). ఈ ఫలితాలతోపాటు ఆదామ అవ్వల పాపము లోకములోనికి ప్రవేశించెను (రోమా 5:12). ఇప్పుడు పాపము సమృద్ధిగానున్న లోకములో ప్రతి వ్యక్తి జన్మించుచున్నాడు. మనము పరిపక్వతకు దినదినము ఎదుగి, పాపము చేయుట ప్రారంభించుచున్నాము. "అందరును పాపముచేసి దేవుడనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు" (రోమా 3:23). ఆదాముయొక్క పాపముయొక్క ప్రభావము మనమీద ఉన్నది. కాని ఆదాము చేసిన పాపము అతనికే పరిమితము. చిన్నపిల్లలు ఆదాముయొక్క పాపమునకు వారసులుకారు. బైబిలు ఈ విషయాన్ని విశదీకరించుచున్నది.

1. పాపము ఒక కార్యము (1 యోహా 3:4). ఒకడు ఆలోచనద్వారా, మాటద్వారా, క్రియద్వారా లేక మేలైనది జరిగించపోవుట ద్వారా పాపము చేయును. జుట్టు రంగు వారసత్వముగ సంక్రమించునట్లు పాపము వారసత్వముగ సంక్రమించదు.

2. భౌతిక శరీరముయొక్క కోరికలు మనలను పాపమునకు నడిపించును (యాకో 1:13-15). కాని మనము జన్మించినప్పుడు పాపము మన శరీరములో లేదు. క్రీస్తు మనవలె రక్తమాంసములు కలిగియుండెను (హెబ్రీ 2:14). అయినప్పటికిని ఆయన పాపరహితుడు (హెబ్రీ 4:15; 1 పేతు 2:22).

3. చిన్నపిల్లలు పాపములేనివారని యేసు సెలవిచ్చెను. కొందరు చిన్నపిల్లలను యేసునొద్దకు ఆయన చేతులుంచవలెనని తీసుకొని వచ్చిరి. ఆయన శిష్యులు వారిని ఆటంకపరచవలెనని ప్రయత్నించగా యేసు తన శిష్యులను గద్దించి "చిన్నపిల్లలను ఆటంకపరచక వారిని నాయొద్దకు రానియ్యుడి. పరలోకరాజ్యము ఈలాటి వారిదే" అని చెప్పెను (మార్కు 10:14).

4. చిన్నపిల్లలు వారి పితరుల పాపములకు బాధ్యులు కారు. "పాపము చేయువాడే మరణము నొందును. తండ్రియొక్క దోషశిక్షను కుమారుడు మోయుటలేదని కుమారుని దోషశిక్ష తండ్రి మోయడు" (యెహె 18:20).

5. ఆఖరిదినమున ప్రజలందరును క్రీస్తు యెదుట నిలువబడినవారై తీర్పు తీర్చబడుదురు. ప్రతివాడు తాను జరిగించిన క్రియల చొప్పున తీర్పు తీర్చబడుదురు గాని ఆదాము జరిగించిన క్రియల చొప్పున కాదు. "ఎందుకనగా తాను జరిగించిన క్రియల చొప్పున, అవి మంచివైనను సరే చెడ్డవైనను సరే, దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడు పొందునట్లు మనమందరమును క్రీస్తు

న్యాయపీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును" (II కొరింథీ 5:10). రోమా 14:10-12, ప్రక 22:12 చూడండి.

6. చిన్న పిల్లలు సువార్తకు విధేయులగుట అసాధ్యము. వారు సువార్తను అర్థము చేసికొనలేరు. వారు సువార్తను విశ్వసించలేరు. మారుమనస్సు పొందలేరు. (పాపముల నుండి తిరుగుటకు నిశ్చయము). వారు కొన్ని నిర్ణయాలు తీసుకొనలేరు. మార్పునొందుటకు వారు పాపములు చేయలేదు. యేసుక్రీస్తు నందలి విశ్వాసమును వారు ఒప్పుకొనలేరు. "హృదయపూర్వకముగా" (రోమా 6:17 వారు ఈ ఆజ్ఞకు లోబడలేరు. గనుక వారు బాప్తిస్మమును క్రమము చొప్పున పొందలేరు. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందినప్పుడు పాపులు విశ్వాసముద్వారా రక్షింపబడుదురు (గలతి 3:26-27; అ. కా. 2 : 38, కొలస్స 2 : 12). చిన్నపిల్లలకు పాపము లేదు మరియు విశ్వాసము లేదు.

చిన్నపిల్లలు బాప్తిస్మము పొందినట్లు ఎట్టి ఆధారము క్రొత్త నిబంధన కలిగియుండలేదు. వారు పాపమునుండి రక్షింపబడనవసరము లేదు. ఎందుకనగా వారు అమాయకులు, పాపరహితులు.

—రోయ్స్ ఫ్రెడరిక్.

---

## బాప్తిస్మము

### అంటే

### ఏమిటి? ఎవరికి? ఎందుకు?

**1. క్రొత్తనిబంధన బాప్తిస్మమనగానేమి?**

క్రొత్తనిబంధనయందు ఒకేఒక బాప్తిస్మము ఆజ్ఞాపింపబడెను (ఎఫె 4 : 5).

అది సమాధి (రోమా 6:4; కొలస్స 2:12) లేక నీటిలో పాతిపెట్టుట (రోమా 6:5, అ.కా. 8:36; 10:47) దాని నిమిత్తము.

విస్తారమైన నీరు (యోహా 3:23).
నీటియొద్దకు వెళ్ళుట (అ.కా. 8:36).
నీటిలోనికి దిగుట (అ.కా. 8 : 38).
నీటిలోనుండి వెలుపలి వచ్చుట (మత్త 3:16; అ.కా. 8:39, యోహా 3:5 అవసరము.

## 2. ఎవరు బాప్తిస్మము పొందవలెను ?

సువార్తను చేర్చుకొనుటకు అర్హులైనవారు. మత్త 28:19-20 మార్కు 16:15-16.

విశ్వసించినవారు. మార్కు 16:16, అ.కా. 8:12
మారుమనస్సు పొందినవారు (అ.కా. 2:38)
క్రీస్తునందలి విశ్వాసమును ఒప్పుకొనినవారు. అ. కా. 8 : 37, రోమా 10:9-10.

## 3. ఎందుకు బాప్తిస్మము పొందవలెను?

బాప్తిస్మము సువార్తలో ఒక భాగము. అందరు దానికి విధేయులు కావలసియున్నది (మార్కు 16:15-16, II థెస్స 1:7-8)
బాప్తిస్మము క్రీస్తు గొప్ప ఆజ్ఞలో ఒక భాగము (మత్త 28 : 19-20).

అది ఆజ్ఞాపింపబడెను. అ.కా. 10:48, యోహా 3:3-5,
అది అవసరము (తప్పనిసరి) అ.కా. 9:6; అ.కా. 22:1-16
పాపక్షమాపణ నిమిత్తము (అ.కా. 2:38)
పరిశుద్ధాత్మ అను వరము పొందుటకొరకు. అ.కా. 2 : 38; తీతు 3 : 3-5

క్రీస్తు రక్తముద్వారా ఆశీర్వాదములు పొందుటకొరకు. హెబ్రీ 9:22-28; 1 యోహాను 5:8

క్రీస్తుసంఘములో సభ్యుడగుట కొరకు. అ.కా. 2 : 41, 47, 1 కొరింథీ 12:13

క్రీస్తును ధరించుకొనుటకు (గలతీ 3:27; రోమా 6:3)

రక్షణకొరకు మార్కు 16:15-16; 1 పేతు 3:18-21.

> గమనిక: నీవు తడవు చేయుట ఎందుకు? లేచి ఆయన నామమును బట్టి ప్రార్థన చేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగివేసికొనుము అ. కా. 22 : 16.

—ఓవెన్ కాస్గ్రోవ్.

## బైబిలు ప్రశ్నలు

1. "ఏసు" అను మరియొక పేరు బైబిలునందు ఎచ్చట కలదు ?
2. యెరూషలేము దేవాలయములో తనకు కలిగినదంతయు కానుకగా ఇచ్చిన స్త్రీ ఎవరు ?
3. 'యేసు కోపపడెను' అను వాక్యము బైబిలునందు ఎచ్చట ఉంది.
4. విద్వాంసుడును, లేఖనముల యందు ప్రవీణుడు అని పేరుపొందిన వ్యక్తి ఎవరు ?
5. రోగులకేగాని ఆరోగ్యముగలవారికి వైద్యుడక్కరలేదు అని చెప్పినవారు ఎవరు ?
6. భూలోకమంతట గొప్ప కరవు రాబోవుచున్నదని ఆత్మద్వారా సూచింపబడి చెప్పిన ప్రవక్త ఎవరు ?
7. యేసు రూపాంతరము పొందినప్పుడు పర్ణశాలలు కట్టుదుమని చెప్పిన శిష్యుడు ఎవరు ? ఎన్ని పర్ణశాలలు ?
8. ఏడుగురు కొడుకులున్న ప్రధాన యాజకుడు ఎవరు ?

9. "నీవు" అను పదము బైబిలునందు ఏ గ్రంథమందు కలదు ! ఏ అధ్యాయంలో ఎక్కువసార్లు కలదు !

10. "అకెల్దమ" అనగా నేమి !

11. నీళ్ళను ద్రాక్షారసముగా మార్చిన దెక్కడ ! యేసుక్రీస్తు చేసిన అద్భుతములలో ఇది ఎన్నవది !

12. ప్రభువునందు ప్రయాసపడు ప్రియురాలు ఎవరు !

13. మొట్టమొదట శిష్యులు ఎక్కడ క్రైస్తవులనబడిరి !

14. యేసు వెంట సిలువను మోయుటకు వచ్చిన వ్యక్తి ఎవరు !

15. అపొస్తలుడు అనగా ఎవరు !

16. సత్ క్రియలను, ధర్మకార్యములను బహుగా చేసి పేరుపొందిన యొప్పేలో ఉన్న శిష్యురాలు పేరేమిటి !

17. "కాబట్టి శరీర దురాశలకు లోబడునట్లుగా చావునకు లోనైన మీ శరీరమందు పాపమును ఏలనియ్యకుడి" అనే వాక్యభాగం ఎక్కడవున్నదో చెప్పగలరా !

18. శరీర కార్యములు అనగా ఏమిటి ! ఆ వాక్యము ఎక్కడ ఉంది!

19. నిద్రాభారము వలన జోగి మూడవ అంతస్తునుండి క్రిందపడి చనిపోయిన యౌవనస్తుని పేరేమిటి !

20. 38 సంవత్సరముల రోగి ఏ స్థలమునందున్నాడు ! ఏ ప్రాంతము ! ఏ దినమున అతడు స్వస్థత పొందెను ! ఎవరు స్వస్థపరచిరి !

21. పాండుర వర్ణము గల గుఱ్ఱముమీద కూర్చునవాని పేరేమిటి !

22. 'పరదైసు' అను వాక్యము ఎక్కడ కలదు ! ఎన్నిసార్లు !

23. క్రైస్తవులు ఎవరివంటివారై యుండకూడదు ! ఎందుచేత !

24. లూకా సువార్త అపొస్తలుల కార్యములు గ్రంథమును రాసిన వ్యక్తి ఎవరు ! అతని వృత్తి ఏమిటి !

25. విశ్వాసవీరులు గురించి బైబిలునందు ఎచ్చటకలదు !

# జవాబులు

1. అపొస్తలుల కార్యములు 13:6వ వచనములో
2. ఒక బీద విధవరాలు మార్కు సువార్త 12 : 42-44.
3. మార్కు సువార్త 3 : 5.
4. అలెక్సంద్రియవాడైన అపొల్లో అను ఒక యూదుడు అపొస్తలుల కార్యములు 18 : 24.
5. యేసుక్రీస్తు లూకా సువార్త 5 : 31.
6. అగబు అపొస్తలుల కార్యములు 11:28.
7. పేతురు మూడు పర్ణశాలలు లూకా సువార్త 9 : 33.
8. యూదుడైన స్కెవయను అపొ.కా. 19 : 14
9. యోహాను సువార్త 17వ అధ్యాయము.
10. రక్తభూమి అపొ.కా. 1 : 19.
11. గలిలయలోని కానా అను ఊరిలో మొదటిది యోహాను 2 : 1-10.
12. పెర్సిను రోమా 16 : 12.
13. అంతియొకయలో అపొ.కా. 11 : 26.
14. కురేనీయుడైన సీమోను లూకా 23 : 26.
15. పంపబడినవాడు యోహాను 13 : 16.
16. తబితా అపొ. కా. 9 : 36.
17. రోమా 6 : 12.
18. జారత్వము, అపవిత్రత, కాముకత్వము, విగ్రహారాధన, అభిచారము, ద్వేషములు, కలహము, మత్సరములు, క్రోధములు, కక్షలు, భేదములు, విమతములు, అసూయలు, మత్తతలు, అల్లరితో కూడిన ఆటపాటలు గలతి 5 : 20-21.
19. ఐతుకు అపొ. కా. 20 : 9.

20. బేతెస్ద కోనేటి దగ్గర. యెరూషలేము ప్రాంతము, యూదుల పండుగ దినము. యేసుక్రీస్తు. యోహాను 5 : 1-10.
21. మృత్యువు ప్రకటన. 6 : 8.
22. లూకా సువార్త 23 : 43.
II కొరింథీ 12 : 3.
ప్రకటన 2 : 7.
3 సాక్ష్య
23. కయీనువంటి వారై, వాడు దుష్టుని సంబంధి. 1 యోహాను 3:12.
24. లూకా. వైద్యం. కొలస్స 4 : 14.
25. హెబ్రీయులకు. 11వ అధ్యాయము.

—ఇసుకపట్ల ఇజ్రాయెల్, కాకినాడ-4.

---

## "పరలోకమందున్న నా తండ్రి నాటని ప్రతి మొక్కయు పెల్లగింపబడును"

## "Every plant, which my father hath not planted shall be Rooted up"

"పరలోకమందున్న నా తండ్రి నాటని ప్రతి మొక్కయు పెల్లగింపబడును" అని యేసుక్రీస్తు పలికిన వాక్యము అలంకార రూపములో చెప్పబడినది అని గ్రహించాలి.

యేసుక్రీస్తు శిష్యులు పెద్దల పారంపర్యాచారములను అతిక్రమించుచున్నారని శాస్త్రిలు పరిసయ్యులు యేసును అడిగారు. పెద్దల పారంపర్యాచార అతిక్రమము ఏమనగా చేతులు కడుగకుండా భోజనము చేయుట. మీ పారంపర్యాచారము నిమిత్తము దేవుని ఆజ్ఞను ఎందుకు అతిక్రమించుచున్నారు! అని యేసుప్రభువు వారిని తిరిగి ప్రశ్న

స్తాడు. వారియొక్క క్రియలను ఆలోచనలను యెరిగిన యేసుక్రీస్తు వారితో మీరు మీ పారంపర్యాచారము నిమిత్తము దేవుని వాక్య మును నిరర్థకము చేయుచున్నారు. వేషధారులారా! ఈ ప్రజలు తమ పెదవులతో నన్ను ఘనపరచుదురు గాని వారి హృదయము నాకు దూరముగా ఉన్నది. మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశ ములని బోధించుచు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు అని యెషయా మిమ్మును గూర్చి ప్రవచించిన మాట సరియే అని వారితో చెప్పి జనసమూహములను పిలిచి—మీరు విని గ్రహించుడి. నోట పడునది మనుష్యుని అపవిత్ర పరచదు గాని నోటినుండి వచ్చునది యే మనుష్యుని అపవిత్రపరచునని వారితో చెప్పెను (మత్తయి 15:1-11).

## పారంపర్యాచార ఫలితము

శాస్త్రులు పరిసయ్యులు వారి పారంపర్యాచారముల నిమిత్తము దేవుని వాక్యమును నిరర్థకము చేయుచున్నారు అని యేసుక్రీస్తు ఆ రోజు అన్నారు. ఈ రోజుల్లో కూడ అలాంటి వారనేకులున్నారు. వీరి స్వంతముగా రూపొందించుకున్న క్రమశిక్షణ పుస్తకములను సంఘము పాటించు పారంపర్యాచారముల చిన్న పుస్తకములను వ్రాసికొని వాటికి కట్టుబడి ఉంటూ అమాయకులైన అనేకులను మోసపరుస్తు న్నారు. పరస్పర విరుద్ధ బోధలు బోధిస్తు క్రైస్తవ్యమును విభజించి, వివిధ మతశాఖలు నెలకొల్పినారినాటి శాస్త్రులు. పరిసయ్యులు, మను ష్యులు కల్పించు పద్ధతులు దైవోపదేశములని బోధించినవారే క్రైస్త వ్యమును విభజించి వివిధ మతశాఖలను నెలకొల్పినవారు. ఈ మత శాఖలు చేయునది వ్యర్థ ఆరాధనయే! వీరి నుద్దేశించి యేసుక్రీస్తువారు పరలోకమందున్న నాతండ్రి నాటని ప్రతి మొక్కయు పెల్లగింపబడును అని అన్నారు. అనగా పరలోకమందున్న దేవుడు స్థాపించని ప్రతి సంఘ మును పెల్లగింపబడును, అంటే నాశనము కావించబడును అని అర్థము.

యేసుక్రీస్తు యొక్క రాకడ సమీపముగా ఉన్నది క్రైస్తవు డనబడే ప్రతి ఒక్కడు కూడా ఏ మొక్కకు చెందినవాడో పరీక్షించుకొనవలసిన అవసరముంది. పరలోకమందున్న దేవుడు స్థాపించినది ఒకేఒక సంఘము. ఆ సంఘము తప్ప ప్రతి ఇతర సంఘము పెల్లగింపబడును. కొందరు "మేము పుట్టుక క్రైస్తవులము" కదా! దేవుణ్ణి క్రమంగా, యదార్థ హృదయముతో ఆరాధిస్తున్నాము. మోసము చేయకుండా జీవిస్తున్నాము. మరియు దేవుని నామమును ఇతరులకు బోధిస్తున్నాము. ప్రవచించుచున్నాము. అద్భుతములు చేయుచున్నాము. దయ్యములను వెళ్ళగొట్టుచున్నాము అని అనుకొన వచ్చును. అయితే ప్రభువు వచ్చినప్పుడు వారిని—నేను మిమ్మును ఎన్నడును ఎరుగను. అక్రమము చేయువారలారా నా యొద్దనుండి పొండి అని క్రీస్తుప్రభువు అంటారు (మత్తయి 7:23). ప్రియులారా, మనము పరీక్షించుకోవలసిన సమయము ఇదే. క్రీస్తు ప్రత్యక్షమైన తరువాత ఏలాంటి తరుణముండదు. సరిదిద్దుకొనుటకు, మారుమనస్సు పొందుటకు ఆస్కారముండదు. మీ క్రియలను, మీ పద్ధతులను, మీ పారంపర్యాచారములను, మీ సంఘములను పరీక్షించుకోండి. అవి దేవునిచే స్థాపించబడలేదని తెలుసుకొన్న వెంటనే వదిలేయండి. సత్యమునకు విధేయులు కండి. దేవుడు ఉద్దేశించినది స్థాపించినది, శిరస్సై యున్నది స్వరక్తమిచ్చి సంపాదించినది ఒకేఒక సంఘము. ఈ సంఘముతో విభేధించే ఏ సంఘమైనా అది పరలోకమందున్న దేవుడు నాటని మొక్క.

## గోదుమలు గురుగులు

యేసుక్రీస్తు బోధించిన మరో ఉపమానము పరీక్షించండి. మత్తయి సువార్త 13వ అధ్యాయము 24 నుండి 30వ వచనము వరకు. యజమానుడు తన పొలములో గోదుమలు విత్తినాడు. అతని

శత్రువు వాటి మధ్య గురుగులను విత్తి వెళ్ళినాడు. మొలకలు పెరిగి గింజ పట్టినప్పుడు శత్రువు గోధుమల మధ్య గురుగులు విత్తెనని తెలుస్తుంది. తన దాసులు గురుగులను పెరికివేయుటకు యజమానుడు నిరాకరిస్తాడు. కోతకాలము వరకు రెంటిని కలిపి పెరుగనీయుండి. తరువాత గురుగులను ముందుగా కూర్చి వాటిని కాల్చివేయుటకును కట్టలు కట్టి గోధుమలను నా కొట్టులో చేర్చిపెట్టుడని చెప్పును. పరలోకమందున్న మన యజమానుడు ఒకేఒక సంఘమును స్థాపించాడు (మత్తయి 16 : 18). అయితే దేవుని శత్రువైన సాతానుడు వచ్చి వివిధ మతశాఖలను స్థాపించాడు (1 తిమోతి 4:1-4) (2వ తిమోతి 3 : 3-4) అంత్యదినమువరకు ఈ రెంటిని కొనసాగిస్తున్నాడు. దేవుడు తీర్పు దినమందు పరలోకమందున్న దేవుడు స్థాపించని ప్రతి సంఘమును గురుగులవలె కాల్చి వేయబడును. గనుక నీవు గోధుమలకు సంబంధించినవాడవా? గురుగులకు సంబంధించినవాడవా? పరీక్షించుకొనగలవు. నీవు వెళ్లే సంఘము ఎవరిచేత, ఏ సంవత్సరములో ఎప్పుడు స్థాపించబడినదో తెలుసుకో. నీవు ఆరాధించు విధానము మనుష్యుల పారంపర్యాచారములను అనుసరించి రూపొందించబడినదా (మత్తయి 15 : 7-9) లేక దైవాంగీకృత ఆరాధనయా (యోహాను 4:24) పరీక్షించు నీవు సహవాసము చేయుచున్న సంఘము యొక్క పేరు వాక్యానుసారమైనదా (1 కొరింథీ 1:2), (రోమా 16 : 16). దానిని నడిపించే పెద్దలు వాక్యానుసారంగా సువార్తకులచే నియమింపబడినవారా? (తీతు 1:5). లేక ఓటువేసి ఎన్నుకోబడినవారా! పెద్దలు దేవుని వాక్యానుసారమైన గుణగణాలు కలిగినవారా! (1 తిమోతి 3:1-7) లేక పలుకుబడివలన ఆ పదవి చేపట్టినవారా! పరీక్షించగలరు. ఈ విషయములను పరీక్షించునప్పుడు ఒక సత్యాన్ని మరచిపోకూడదు. ఈ ప్రపంచములో ఉన్న మతశాఖలన్నియు (సంఘములని పిలువబడేవన్నియు) సరియైనవి కావు. ఒకటి మాత్రమే సరియైనదై ఉంటుంది.

ఆ సంఘము అన్ని విషయములలో వాక్యానుసారమైనదై ఉంటుంది. పరిశుద్ధ గ్రంథములోనివి తీసివేయదు. లేనివి కలుపదు ఇది పరలోక మందున్న దేవునిచే స్థాపింపబడిన సంఘము. అది క్రీస్తు సంఘము.

—V.J. జెన్‌సన్, హైదరాబాదు.

---

## విప్లవ వీరులు

ఈ రోజులలో విప్లవము అను మాట రాజకీయాలలో మాత్రమే గాక ప్రతీ జీవితములోను చిరపరిచితమై యున్నది. విప్లవము అంటే మనకు వెంటనే తిరుగుబాటు జ్ఞాపకం వస్తుంది. రెండువేల సం॥ల క్రితం యేసు క్రీస్తు ఈ లోకంలో అడుగు పెట్టియున్నాడు. ఆయన బోధలు విని, క్రియలను చూసి ఆనాటి కాలపు వారు ఆయనను విప్లవ కారుడు అన్నారు. క్రీస్తు ఆరోహణమైన తరువాత ఆయన శిష్యులు ఆయన బోధలు చేయుచుండగా వీరి నుద్దేశించి "భూలోకమును తలక్రిందులు చేయువారు" అని విమర్శించినదీ లోకం. అది అక్షరాల నిజమే (అపొ. కా. 17 : 6).

అయితే యేసు తెచ్చిన విప్లవం లౌకికమైనది కాదు. ఆయన. పోరాటం శరీరులతో కాదు. యేసుయొక్క విప్లవం ఆధ్యాత్మికమైనది. ఆత్మసంబంధమైనది. మతసంబంధమైన విప్లవం అది. ఆయన శిష్యులు కూడా యేసుయొక్క మార్గాన్ని నెలకొల్పడానికి విప్లవ వీరులై ధైర్యశీలులై అపహాస్యములను, దెబ్బలను, చెఱసాలలను, చివరకు మరణమునుకూడా లెక్కచేయక ముందుకు సాగిపోయినారు. హతసాక్షులైనారు. సాతాను శక్తులను ఎదిరించి మానవ రక్షణార్థమై దైవావేశముతో దైవ గ్రంథము లిఖించినారు.

యేసుయొక్క విప్లవానికి సిలువ వీరులు కావాలి. ఈ బాధ్యత ను ప్రతి క్రైస్తవుడు కలిగియున్నాడు. "తనను తాను ఉపేక్షించుకొని తన శిలువ నెత్తుకొని" నడుస్తు నీతిమంతులై ధైర్యశీలులై సాగి పోవాలి (లూకా 9 : 23). ఈ వీరులు వెనుతిరుగువారై యుండరాదు. "—నాగటిమీద చేయిపట్టి వెనుకతట్టు చూచువాడెవడును దేవుని రాజ్యమునకు పాత్రుడుకాడు" (లూకా 9 : 62). ప్రభువుయొక్క యోధులు స్థిరులును, నిబ్బరమైన బుద్ధిగలవారై ప్రభువు బలమును పొంది బలవంతులై ప్రాణములను లక్ష్యపెట్టనివారై యుండవలెను. దేవుడనుగ్రహించు ఆత్మీయ ఆయుధములను ధరించి సాతాను శక్తులను జయించి సువార్త సేవలోను, అనేకులను ప్రభువు మార్గమునైపు త్రిప్పుటలోను ముందుకు సాగిపోవాలి. నియమము ప్రకారము పోరాడువాడే విజయకిరీటమునకు అర్హుడు. విప్లవవీరులు తమ పరుగు కడముట్టించేవరకు పోరాడుతారు (II తిమోతి 4 : 7, 8).

అంధకార క్రియలను విసర్జించి తేజస్సంబంధమైన యుద్ధోపకరణములు ధరించికొనినవారై యేసు విప్లవానికి తగినవారు (రోమా 13 : 12). "దేవుని రాజ్యం మాటలతో కాదు శక్తితోనే యున్నది" (1 కొరిం 4 : 20). ఆత్మను చంపనేరక దేహమును చంపువారికి భయపడకూడదు (మత్తయి 10 : 28).

క్రీస్తు వీరులు జారత్వం, అపవిత్రత, కాముకత్వము, దురాశ, ధనాపేక్ష అను శరీరకార్యములను విసర్జించాలి (గలతి 5 : 19-21). వెనుకనున్నవి మరచి ముందున్నవాటికై వేగిరపడుచు గురియొద్దకే పరుగెత్తవలెను (ఫిలిప్పి 3 : 13-14). దేవుని బోధకులమంటూ మోసగాండ్రగు పనివారును, అబద్ధ బోధకులును, దొంగ అపొస్తలులును గలరు. అట్టివారిని కనుగొని జాగ్రత్త పడాలి (II కొరిం 11 : 13; II పేతురు 2:1). ఎదుట వారికి బోధించుచు తమకు తాము బోధించు

కొనని వీరు దుర్బోధకులును, ద్రాక్షతోటలను చెరుపు గుంటనక్కలునై యున్నారు (పరమ గీతములు 2 : 15). క్రీస్తు పేరులేని సంఘాలతో సతమతమౌతూ బిరుదులు ధరించుచూ క్రీస్తు మార్గాన్ని చెరుపుతున్నారు (యోబు 32 : 21).

క్రీస్తు వీరులు సత్యమునుండి తొలగిపోయినవారి కట్టడలను అనుసరింపక వారికి శుభమని చెప్పకూడదు (II యోహాను 9 : 11). క్రొత్తనిబంధనలో అనేకులు క్రీస్తుయొక్క విప్లవ వీరులై శ్రేష్ఠమైన క్రీస్తు మార్గాన్ని ప్రజలకు అందించారు. అందు నిమిత్తమై వారెన్నో వ్యయప్రయాసల కోర్చినారు. దేవుడు మనలనుకూడా తన సైన్యములో చేరవలెనని కోరుచున్నాడు (II తిమోతి 2 : 3, 4). ప్రతి క్రైస్తవుడు ఒక వీరుడై యున్నాడు. యుద్ధోపకరణములను గూర్చి ఎఫెసీ 6 : 11-17 వచనాలలో చదవగలం.

ఈ వ్యాసము చదువుచున్న సోదరీ, సోదరుడా నీవు క్రీస్తు వీరుడవగుటకు నీ నడుము కట్టుకొనుము. యుద్ధోపకరణములు ధరించుము. వాక్యమను రెండంచులు గల ఖడ్గమును చేత పట్టుకొని దుర్బోధలను ఖండిస్తు క్రీస్తు సువార్తను చాటించుము. అనేకులకు ప్రభువును గూర్చి వివరించుము. క్రైస్తవులనుగా చేయుము. నీ జీవితాన్ని ప్రభువుకొరకు వినియోగించుము. ఈ విధముగా చేసినయెడల ప్రభువు ఇచ్చు మహిమా కిరీటమును, వాడబడని కిరీటమును పొందుదువు.

—D. అబ్రాహాము, క్రీస్తు సంఘము, నడిపూడి.

---

# మన రాజు వచ్చుచున్నాడు

## (Our King is Coming)

ప్రభువు మానవుల మధ్య నివసించిన కాలంలో, ఆయన ఒక

వాగ్దానమును చేసెను. "నేను మరల వచ్చెదను" శతాబ్దాల తరబడి ఈ వాగ్దానము ప్రతిధ్వనించుచు బాధింపబడుచున్న పరిశుద్ధులకు ఆదరణ కలిగించుచున్నది. "ఆలాగుననే క్రీస్తు కూడ అనేకుల పాపములను భరించుటకు ఒక్కసారే అర్పింపబడి, తన కొరకు కనిపెట్టుకొని యుండువారి రక్షణ నిమిత్తము పాపము లేకుండ రెండవసారి ప్రత్యక్షమగును" (హెబ్రీ 9 : 28). క్రొత్త నిబంధన యందు ఈ వాగ్దానము సుమారు 300 సార్లు ప్రభువు చేసియున్నాడు. "నేను మరల వచ్చెదను".

అవును, మన రాజు వచ్చుచున్నాడు. కిరీటాన్ని ధరించి రాజ్య పరిపాలన చేయుటకు కాదు. తన పరిపాలనను ముగించి తనవారిని చేర్చుకొనుట కొరకు వచ్చుచున్నాడు! ఆయన రాకనుగూర్చిన కొన్ని అంశాలను పరిశీలించుదము.

1. అది అధికారము కలది. "తన మహిమతో మనుష్య కుమారుడును ఆయనతో కూడ సమస్త దూతలును వచ్చునప్పుడు ఆయన తన మహిమగల సింహాసనము మీద ఆసీనుడై యుండును" మత్త 25:31. "మనుష్యకుమారుడు ప్రభావముతోను మహా మహిమతోను ఆకాశ మేఘారూఢుడై వచ్చుట చూచెదరు" మత్త 24:30.

2. అది అకస్మాత్తుగా వచ్చును. "ఆ దినమైనను గడియయైనను మీకు తెలియదు గనుక మెలకువగా ఉండుడి" (మత్త 25 : 13). "మీరనుకొనని గడియలో మనుష్యకుమారుడు వచ్చును. గనుకనే మీరును సిద్ధముగా ఉండుడి" (మత్త 24 : 44).

3. పక్షపాతమునకు అది అంతము. "అప్పుడు సమస్త జనములు ఆయన యెదుట పోగుచేయబడుదురు, గొల్లవాడు మేకలలో

నుండి గొఱ్ఱెలను వేరుపరచునట్లు ఆయన వారిని వేరుపరచి తన కుడి వైపున గొఱ్ఱెలను, ఎడమవైపున మేకలను నిలువబెట్టును" (మత్తయి 25 : 32). "వీరు నిత్యశిక్షకును నీతిమంతులు నిత్యజీవమునకును పోవుదురు" (మత్త 25 : 46).

**4. కొందరికది గొప్ప సంతోషమునకు ప్రారంభము.** "అప్పుడు రాజు తన కుడివైపున ఉన్న వారిని చూచి - నా తండ్రి చేత ఆశీర్వదింపబడిన వారలారా, రండి; లోకము పుట్టినది మొదలు కొని మీ కొరకు సిద్ధపరచబడిన రాజ్యమును స్వతంత్రించుకొనుడి" (మత్త 25 : 34).

**5. ఇతరులకది గొప్ప దుఃఖమునకు ప్రారంభము.** "అప్పుడాయన యెడమవైపున ఉండు వారిని చూచి - శపింపబడిన వారలారా, నన్ను విడిచి అపవాదికిని వాని దూతలకును సిద్ధపరచ బడిన నిత్యాగ్నిలోనికి పోవుడి" (మత్త 25 : 41).

---

## కాకినాడ బిల్డింగు విరాళముల జాబితా

కాకినాడ బిల్డింగు నిమిత్తమై విరాళము నిచ్చిన ఈ దిగువ మిత్రులందరికీ మా హృదయపూర్వక వందనములు. ఈ బిల్డింగ్ సంపూర్తియగు వరకు మాతో కలసి తప్పక ప్రార్థించండి.

| | |
|---|---|
| K. ఆదాము, వరంగల్ | 20-00 |
| Y. వందనం, శంఖవరం | 30-00 |
| వినుకొండ అబ్రాహాము, ముడివేముల | 10-00 |

| | |
|---|---|
| A.S.D. ప్రసాద్, గునుపూడి, భీమవరం | 25-00 |
| గడ్డా వీరన్న, పెనుగొండ | 85-00 |
| D.S. ప్రకాశరావ్, కోటబొమ్మాళి | 100-00 |
| P. చంద్రశేఖర్, ధవళేశ్వరం | 15-00 |
| T. ఉషారాణి, ధవళేశ్వరం | 10-00 |
| P.N. హామ్, పాతళ్ళ దిబ్బ | 40-00 |
| Randolph Gonce, U.S.A. | 1800-00 |

—o—

Regd. No.H /KD—45/KD.H.O.

*From*
**S A T Y A W A K K U**
P.O. Box 80
KAKINADA 533 001

No.

To
..............................
..............................
..............................
..............................